హ్యూబర్ట్ ఫిక్టె

# స్వేచ్ఛా ప్రాంతం

వెనీషియన్ కిటికీ తెరల వెనకనించి, వెళ్ళిపోతున్న అతనివంక ఆమె చెయ్యి ఊపింది. అతను మూడో అంతస్థువేపు చెయ్యి ఊపాడు. అతను బస్సు ఎక్కేదాకా ఆమె చూసింది. తరవాత వెళ్ళి టేబిల్ శుభ్రపరచింది. మార్గరీన్, జాబ్, డబ్బాపాలు జాగ్రత్త పెట్టింది. కప్పులు తీసింది. కోడిగుడ్డు పెచ్చులు – ట్రేలో పోసి అవతలకి తీసికెళ్ళింది. ఈ ప్రాంతం నాకు తెలియదు, అనుకుంది. తనే తీసికెళ్ళి అంతా చూపిస్తానన్నాడతను, తరవాత ఆ మాటే ఎత్తలేదు. ఆమె అడిగింది ఒకటి రెండుసార్లు. ఏవో సాకులు చెప్పాడు "ఇప్పుడు కాదు..." బయట చలి ఆమె భరించలేదు. అసలా మాటకు అర్థమేమిటో ఆమెకు బోధపడలేదు. యాథాలాపంగా అడిగిందామె, స్వేచ్ఛా ప్రాంతమంటే ఏమిటని – సమాధానం చెప్పకండా దాటేశాడు.

అసలు దాన్ని స్వేచ్ఛా ప్రాంతమని ఎందుకంటారు? ఇతర ప్రాంతాల్లో కంటే ఇక్కడ స్వేచ్ఛ ఎక్కువా? ఇక్కడ నావికులు, కస్టమ్స్ ఉద్యోగులు, నౌకాశ్రయం పనివాళ్ళు మిగతా చోట్లకన్నా స్వేచ్ఛగా తిరగొచ్చా? ఇక్కడి చట్టాలే వేరా? లేకపోతే ఇతరచోట్ల వస్తువులమీద విధించబడ్డ నిషేధాలు ఇక్కడ తొలగిపోతాయా?

దీన్ని గురించి మరొకర్ని అడగడానికి ఆమెకు మనసొప్పలేదు. వాళ్ళు ఎగతాళి చేస్తారేమోనని ఆమె భయం. "ఆ మాత్రం తెలీదా? మీ ఆయన నీ కీ విషయం ఎప్పుడో చెప్పి వుండవలసింది. అత నప్పుడే కస్టమ్స్ సహాయోద్యోగిగా పని చేస్తున్నాడు కూడా. ముందు ముందు ఇంకా పై తరహాకి పోయేటట్టే కనిపిస్తున్నాడు. మనలో మనమాట. ఒక్కసారిగా ఇన్స్పెక్టర్ అయిపోవాలని మహాగట్టి ప్రయత్నం చేస్తున్నట్టు మా నమ్మకం. కస్టమ్స్ ఉద్యోగి పెళ్ళానివి, స్వేచ్ఛా ప్రాంతం అంటే ఏమిటో తెలియదంటే, నిజంగా ఆశ్చర్యమే," అని దుయ్యబడతారని ఆమె సంకోచం.

ఆదివారం శలవు రోజునైనా స్వేచ్ఛా ప్రాంతం అంతా తనకి చూపించమని అతన్ని బలవంతపెట్టడానికి, ఆమెకు మనసొప్పలేదు. జంతుశాలకో, నదీతీరానికో షికారుపోతే పాపం అతనికి విశ్రాంతి దొరుకుతుంది. కొంచెం పెద్ద సెలవులొస్తే ఇటలీకి పోవచ్చు. ఆఫీసునించి బయటికొచ్చాక, ఆఫీసు గొడవల్ని గురించి ప్రస్తావించడమే అతని కిష్టం లేకపోవచ్చు. అంచేత అతన్ని బలవంత పెట్టడం మంచిది కాదు. ఏదో అతి ముఖ్యమైన పరీక్ష ఉందన్నాడు – రెండు మూడుసార్లు ఒకవేళ ఆ పరీక్ష అయిన తరవాత కాస్త ధారాళంగా చెపుతాడేమో, ఆఫీసు విషయాలు.

అబ్బో, ఇంకా నూరేళ్ళుంది మా జీవితం – అనుకుంది ఆమె. ఇలాగే ఆఖరుదాకా గడిచిపోతే చాలు. అయితే అతని ఉద్యోగానికి ఒక నిర్ణీత సమయమంటూ లేదు. సరిహద్దు

కేంద్రంలో డ్యూటీ ఒకొక్కప్పుడు పగలుంటుంది. ఒకొక్కప్పుడు రాత్రికి మారుస్తారు. అలా మారినప్పుడు దినచర్య అంతా తారుమారైపోతుంది. అదొక పెద్దవిషయం కాదు. జీతం నాలుగువందల మార్కులు. దమ్మిడీ దూబరా చెయ్యడు. ఎవ్వరికీ దమ్మిడీ అప్పుపెట్టక్కర్లేదు. అసలా మనిషే వేరు, అందరిలాంటివాడు కాదు అనుకుందామె.

అతను ఆఫీసుకి పోయినా, ఆమెకు తోచకపోవడమంటూ లేదు. పక్కనున్న రొట్టెల దుకాణానికిపోయి, వాళ్ళకి పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు తరచు సహాయం చేస్తుంటుంది. ఇంట్లో బట్టలన్నీ తనే ఉతుకుతుంది. ఏమీ విసుక్కోకుండా, ఆ ముతక కస్టమ్స్ ఆఫీస్ యూనిఫారం తనే ఇస్త్రీ చేస్తుంది. స్వయంగా బజారుకి వెళ్ళి, సరుకులు కొని, అతని కిష్టమైన వంటకాలు చేసి పెడుతుంది. సరిహద్దు కేంద్రంనించి అతను ఇంటికి తిరిగొచ్చేసరికి బల్లమీద పదార్థాలన్నీ అమర్చిపెడుతుంది. అసలు ఈ సరిహద్దు ఎటువంటిది? అని తర్కించుకుంది, బల్లమీద అతను వొదిలిపెట్టిన రొట్టెపెచ్చులన్నీ ఇనపచేటలోకి తుడుస్తూ ఉత్తరాదినున్నాయి సరిహద్దులు – అతనక్కడ విమాన విధ్వంసక దళంలో పని చేశాడు కూడా.

"ఎంత మంచిరోజులవి!" అంటుంటా డతను అప్పుడప్పుడు చిరిగిపోయిన కవరులోనుంచి, తనూ స్నేహితులూ కలిసి తీయించుకున్న ఫోటోలు తీసి చూపించేవాడు. వాళ్ళలాగులు సంచుల్లా ఉన్నాయి. ఫిరంగులు బిగించిన సిమెంటు కట్టడానికి జేర్లబడి నవ్వుతున్నారంతా.

"అప్పుడెంత లేతగా ఉంది నీ ముఖం!" అనేది ఆమె ఆ బొమ్మలు చూసినప్పుడల్లా.

నవ్వుతున్న సైనికుల్ని ఒక్కొక్కర్నీ వేలెట్టి చూపిస్తూ, "వీడూ, వీడూ, వీడూ – తరవాత చచ్చిపోయారు – రష్యాలో," అని చెప్పేవాడు.

"వాడికీ నాకూ మహాదోస్తీ." అతని కళ్లు రెప్పవాల్చకుండా ఎంతోసేపు ఫోటోలో ఆ ముఖంవంక చూస్తుండేవి.

"ఇదేం ఫోటో?" అందామె, పాతబడి అస్పష్టంగా అయిపోయిన ఒక ఫోటోతీసి.

"ఒక దాడి జరుగుతున్నప్పుడు, చవకబారు కామెరాతో తీసిందది. జ్ఞాపకం లేదూ – ట్రేడర్ తుపాకిగుళ్ళు? ఇవి సరుగుడుచెట్లు, ఇది గుండుపేలిన మెరుపు."

"ఏమో. అప్పటికి నాకు మరీ చిన్నతనం."

"ఇప్పు డక్కడ ఎలా ఉందో చూడాలని ఉంది."

ఈ రోజుల్లో డెన్మార్క్ సరిహద్దు, నిజమైన సరిహద్దే కాదు. ఇంకా ఆఫ్రికాలో ఉన్నాయి సరిహద్దులు. భారత పాకిస్తాన్ దేశాల మధ్య ఉన్నది అసలైన సరిహద్దు. మన పట్టణానికి మధ్య, స్వేచ్ఛాప్రాంతంలో – ఏదో సరిహద్దంటారు జనం.

"అక్కడ దొంగ సరుకుల రవాణా జోరుగా సాగుతుంటుందా?" అని అడిగిందామె.

"అసలు రవాణా వ్యాపారం సాగించడానికి ముందు దొంగ సరుకులు సంపాదించాలి. తరవాత గుండె నిబ్బరముండాలి. ఎవడన్నా సాహసించి, దొరికినన్ని మాంసం డబ్బాలు దాచి పెట్టాడే అనుకో, వాడు గేటు దగ్గర కొచ్చేలోగా పరిశీలకులికి ఈ రహస్యం ఇంకొకడెవడో అందజేసే ఉంటాడు."

"పరిశీలకులంటే?"

"అదంతా ఓ పెద్ద నాటకంలే."

"ఈ సరిహద్దులో పని చెయ్యడం నీ కంత యిష్టం లేదా?"

"ఏం? బాగానే ఉంది. జీతం యింటి ఖర్చుకి సరిపోతోంది - నువ్వు సంపాదించే దానితో కలిపి. పై పరీక్ష పాసయితే మంచిదేమో. అవకపోయినా ఫరవాలేదు. సుఖంగానే ఉంది - కాస్త ఇబ్బంది లేకపోలేదు."

"పని కష్టంగా ఉంటుందా?"

"అబ్బే."

"నాకోసం నువ్వు పై పరీక్ష అవక్కర్లేదు. నాకూ యిబ్బంది ఏమీ లేదు."

"అన్నీ బాగానే ఉన్నాయి."

"నిజమే."

"నిజంగా నీ అభిప్రాయం అదేనా?"

"అవును, ఏం?"

"అయితే నేను పరీక్షకి వెళ్ళనే అక్కర్లేదంటావు."

పరీక్షకు వెళ్ళమని కాస్త ప్రోత్సహించవలసిందేమో తను. నానిన కాఫీ గుండ కడుగుతుంటే నీటిమీదికి తేలుతోంది. ఈసారి మళ్లీ అడిగితే, పరీక్షకు వెళ్ళమని నచ్చచెబుతాను. అనుకుంది ఆమె. వెడితే తప్పకుండా పాసవుతాడు.

తమకి ఒక పిల్లో పిల్లవాడో పుడితే ఎంత బాగుండును, అనుకుందామె. ప్రతి ఆదివారం జంతుప్రదర్శనశాలకి వెడతారు ఇద్దరూ కొడుకుని తీసుకుని, బుల్లిచెయ్యి తనకందిస్తాడు కొండ ఎక్కేటప్పుడు, తన కొడుకు. తండ్రిలాగే బరువుగా మౌనంగా ఎక్కుతాడు కొండ, ఆ మేకలుమేసే కొండ.

డీట్రిచ్ సరిహద్దు ఆఫీసులో పని ముగించుకుని బయటపడేసరికి ఏడున్నర అయింది. అతను పట్నంలోకి పోయే వంతెనవేపు పోలేదు. అటుపోతే చిన్ని సారా దుకాణాలున్నాయి. నావికులు 'ష్నాపే' మద్యం వాడుతుంటారు. రకరకాల కాయకూరల పులుసులు, మాంసాహారాలూ కూడా అమ్ముతా రక్కడ. అయితే అతనావేపు పోలేదు. స్వేచ్ఛా ప్రాంతం, ఇంకా లోపలికి నడిచి వెళ్ళాడు.

"ఏం పని సరదా తీరలేదా?" అన్నాడు హెర్ షెన్ ఫెల్డర్, "ఇంకో చుట్టు తిరిగొస్తావా? లేకపోతే ఏ పిల్లతోటన్నా భేటీ ఉందా? కాస్త ఏదన్నా వెనకేసుకుందామని చూస్తున్నావా?" హెర్‌షెన్ ఫెల్డర్ నవ్వుతూ అన్నాడు.

"నాకో అనుమానం తగిలింది," అన్నాడు డీట్రిచ్. హెర్‌షెన్ ఫెల్డర్‌ని వదిలించుకోడానికి అలా అనవలసొచ్చింది, "పనీ పంగూ ఏమీలేదు, ఊరికే తిరగాలని ఉంది తిరుగుతున్నాను," అని చెపితే బాగుండదు.

అలా చెపితే సబబుగా అనిపించదనుకున్నాడతను.

"ఒక ఆచూకీ దొరికింది. కొంచెం పరిశోధన చేస్తున్నాను. ఇంకా నిర్ధారణగా ఏమీ చెప్పలేను."

"అర్థమైంది," హెర్‌షెన్ ఫెల్డర్, డీట్రిచ్ కళ్ళలోకి సూటిగా చూశాడు. అతని ముఖంమీద ముడుతలు మరింత – స్ఫుటంగా పడ్డాయి.

"మందులా?"

డీట్రిచ్ తల అడ్డంగా ఊపాడు.

"నగలా? బంగారమా?"

డీట్రిచ్ కాదన్నట్టు తలూపి కదిలాడు. సరుకుల కొటారాల నల్లని వరస దాటాడు, రేవుకిపోయే దారివెంట నడిచాడు. సరుకులు దింపే షెడ్ల పక్కని రాళ్ళు పరిచిన దారంతా నిర్మానుష్యంగా ఉంది. షెడ్ల మధ్య కాళీస్థలంలో కార్లు బారులు బారులుగా నిలబడి ఉన్నాయి. ఏటవాలు ప్రదేశాల్లో పీపాలు ఒత్తుగా పేర్చి ఉన్నాయి. మనిషి ఎత్తు తీగచుట్టలమీద స్వీడిష్ భాషలో చిరునామా ఇతర వివరాలు రాసి ఉన్నాయి.

డీట్రిచ్ అరుగుమీద చెయ్యి ఆనుకొని, పడవల్లోకి సరుకు లెక్కించే అరుగుమీదికీ ఎక్కాడు. నీటికీ కొటారాలకీ మధ్య దారివెంట నడిచాడు. ఓడల కోసం కట్టిన వంతెనలు వాటికింద గూడ్సుబళ్ళు దాటాడు. గూడ్సు పెట్ల తలుపులు సీళ్ళు వేసి ఉన్నాయి. పెద్ద యినప చట్రాల మీద నియాన్ దీపాలు వెలుగుతున్నాయి. దారి పొడుగునా. అతని నీడ, అతని చుట్టూ తిరుగుతూ సాగింది.

రాత్రివేళ ఇది స్మశానంలాగుంటుంది, అనుకున్నాడు డీట్రిచ్. సరుకులనన్నీ, జారే తలుపుల వెనక పేర్చి వున్నాయి – వాసన కొడుతూ. ముడిపదార్థాలూ, సగం తయారైన సరుకులు, పొగాకు, పొటాష్, సుల్తానా పళ్ళు. వీటి తాలూకు ఫారములు, ఇతర కాగితాలు, కస్టమ్స్ ఇన్స్పెక్టర్ల బల్లమీద దొంతరలుగా పెరుగుతున్నాయి.

ఆ ద్వీపం కొనదాకా నడిచాడతను. చిన్ని ఉపనదులన్నీ పెద్ద నదిలో కలుస్తున్నాయక్కడ. అక్కడున్న పాత కొటారాలు యిదివరకే పీకి పారేశారు. మొండిగోడలు, రేవుల మీద ఎత్తుగా ఉన్న దీపాల వెలుగులో ఊదారంగుగా కనబడుతున్నాయి. సరిహద్దు ఆఫీసులో గంటలకొద్దీ కూర్చుని వచ్చాక, ఇక్కడెంత బాగుంది – అనుకున్నాడు డీట్రిచ్. మొండిగోడ లెక్కొచ్చు. కదలిక ఎరగని ఆ గాలిని హాయిగా పీల్చాడు. పీకేసిన కొటారాల్లోంచి దుమ్ము, కుళ్ళు కంపుతో కలిపి.

సరిహద్దులో ఎనిమిది గంటలు పని – అనుకున్నాడు డీట్రిచ్. స్వేచ్ఛా ప్రాంతానికి పైకొసనించి కార్లు సరాసరి లోపలికొస్తాయి. తను కాపలా వుంటే గేటులోంచి బయటికెళ్ళిపోతాయి. ఇటునించి అటూ పోతుంటాయి. చుట్టు దారొకటి వుందిగాని, చాలామంది యీ అడ్డదారినే పోతుంటారు. ఆ కార్లు పరిశోధించి లాభంలేదు. వాటిలో ఏమీ దొరకవు. ఉద్యోగధర్మం గనక, ఆ కార్లదగ్గరకు పోతాను. డ్రైవర్లనీ, ప్రయాణికుల్నీ పరీక్షగా చూస్తాను. కొద్దిక్షణాలు ఆలోచిస్తున్నట్టు నిలబడతాను. ఆలోచన శుద్ధ అనవసరమని నాకూ తెలుసు. ఆ డ్రైవర్లకీ తెలుసు. తరవాత వెళ్లొచ్చునని చెయ్యి ఊపుతాను.

డీట్రిచ్ తడుముకుంటూ కింద ఉన్న బల్లకట్టు దగ్గరకు చేరుకున్నాడు. నీటి ఒడ్డుకి చేరుకునేసరికి ప్రక్కనున్న స్తంభం నీడలోంచి ఒక వ్యక్తి ఇవతలికి దూకాడు. "హడలగొట్టేశావు నన్ను," అన్నాడతను.

"నిన్ను వెతుక్కుంటూ రాలేదే నేను, నేను హడలగొట్టడమేమిటి?" అన్నాడు డీట్రిచ్.

"బల్లకట్టు దగ్గరకల్లా జోరుగా వచ్చేసరికి..."

"చట్టానికి వ్యతిరేకంగా నువ్వేమన్నా చేస్తున్నావా?"

"నేనా..."

"ఈ స్వేచ్ఛా ప్రాంతంలో చీకటిపడ్డదాకా ఏం జేస్తున్నావు?"

ఆ మనిషి స్వేచ్ఛాప్రాంతంలో ఆ వేళప్పుడు ఏంజేస్తున్నాడో, డీట్రిచ్‌కి అనవసరం. అలవాటుకొద్దీ, అతను సైకిల్‌మీద స్వేచ్ఛా ప్రాంతంలో పోతున్నప్పుడు ఎవరన్నా తన్ని చూసి కస్టమ్స్ కొటారాల దగ్గిరనుంచి పారిపోతుంటే గట్టిగా అరిచి వాళ్లని ఆపుతాడు, పరీక్ష చేస్తాడు.

"ఇంకా ఏడున్నరన్నా కాందే. అయినా ఈ రాత్రివేళ నువ్విక్కడేం చేస్తున్నావు?" అన్నాడా వ్యక్తి.

"నేను కస్టమ్స్ ఉద్యోగిని."

"నిజంగా?"

"అవును, తాత్కాలికోద్యోగిని."

"ఓహో... తాత్కాలికోద్యోగివా."

"దానికేంగాని, నా ప్రశ్నకి నువ్వింకా సరియైన సమాధానం ఇవ్వలేదు."

"నది ఒడ్డున ఉచ్చపోసుకోడానికికూడా కస్టమ్స్ అధికారుల అనుమతి కావాలాయేం?"

డీట్రిచ్ అతని భాష కేమీ అభ్యంతరం చెప్పలేదు. ఆ మనిషి భయపడుతుండడం, అనుమానానికి తావిచ్చింది. అయితే తన అనుమానం బయటపెట్టలేదు డీట్రిచ్. ఆ వ్యక్తి నతడు పరీక్షించొచ్చు, కావాలంటే, బట్టలన్నీ విప్పేసి పరీక్షించొచ్చు.

నాకదృష్టం లేదు - అనుకున్నాడతను, నేను ఎప్పుడు పరీక్ష చేసినా ఏమీ దొరకదు, ఎప్పుడైనా సిగరెట్లు దొరుకుతాయి. కార్లో కూచున్నవాళ్ళ కాళ్ళకింద దొంగఅరలో పులితోలో, మొసలిచర్మం సంచీయో దొరకొచ్చు. వాటి ఖరీదుకి మించిన శ్రమపడాలి, కాగితాలు ఖరాబు చేసిచేసి, నా కెప్పుడూ వజ్రాలుగాని, నల్లమందుగాని దొరకలేదు. హెర్‌షెన్ ఫెల్డర్ నల్లమందు దొంగ రవాణా ఇప్పుడీ ప్రాంతంలో తగ్గిపోయిందంటాడు. మనదేశంలో అటువంటి వాటిమీద మోజులేదు. యుద్ధానంతరం ప్రజలంతా దేశాన్ని గట్టిపునాదులమీద కట్టడానికి పూనుకున్నారు. మందులు దొంగరవాణా చెయ్యవలసిన అవసరం ఏముంది వాళ్ళకి?

"చెప్పలేం చూడు, ఈ బల్లకట్టుమీద చట్టవిరుద్ధమైన పనిఏదన్నా చెయ్యడానికి నువ్వు ప్రయత్నిస్తూ ఉండొచ్చు, రాత్రి నదిలో పడి ఆత్మహత్య చేసుకోవచ్చు."

"ఎన్నడూ చెయ్యను."

డీట్రిచ్ కడుపులో శరీరంలో ఆకలి అంటువ్యాధిలా వ్యాపిస్తోంది. ఆంకీ బంగాళాదుంపలు వొలిచి తెల్లని పాత్రలో వేసి మిగతా కూర ముక్కలతో పొయ్యి మీద బెడుతుంది. అతని కాళ్ళకింద బల్లకట్టు నీట్లో పైకీ కిందికీ ఆడుతోంది. అతను తలెత్తి

చూశాడు. రేవు పొడుగునా నియాన్ దీపాలు వెలుగుతున్నాయి. దూరాన సగం పూర్తయిన సరకుల ఓడ అంచులు ఆనమాలు కట్టడానికి ప్రయత్నించా డతను. దాని వెడల్పాటి సరుకులు నింపుకుని ప్రపంచం చుట్టూ తిప్పుతుంది వాటిని. ఇతర స్వేచ్ఛా ప్రాంతాల రేవుల్లో వాటిని దిగుమతి చేస్తుంది. బల్లకట్టు ఊపు తట్టుకోలేకపోయాడు డీట్రిచ్. తూలడం మొదలుపెట్టాడు. కఱ్ఱ మెట్లు గబగబా ఎక్కాడు. ఆ మనిషితో మళ్ళీ మాట్లాడలేదు. గట్టి నేలమీద నడుస్తున్నా, బల్లకట్టు ఊపుకి అలవాటుపడ్డ కాళ్ళు తేలిపోతున్నాయి. రోడ్డువెంట కొటారాలు దాటి వెళ్ళాడు.

తను పరీక్షకి కూచోవాలా వద్దా? ఆంకీ తన్ని బలవంతపెట్టడంలేదు, ఆమె తన ఆశల్ని కోరికల్ని అదుపులో ఉంచుకోగలదు. కొన్నాళ్ళుపోతే, అతని జీతం, ఉద్యోగం ఎల్లాగా పెరుగుతాయి. టేకుతో చేసిన గోడ అలమారు కొనాలని ఆమె కెంతో కోరిక. డెన్మార్క్‌లో చేసిన కఱ్ఱసామానన్నా, దీపాలన్నా ఆమెకు మహా ఇష్టం.

విమాన విధ్వంసక కేంద్రానికి డెన్మార్క్ అట్టే దూరంలేదు - అనుకున్నాడతను.

ఇలాంటి విదేశీ సరుకులు - దిగుమతి పన్ను కడితేగాని దొరకని సరుకులు స్వేచ్ఛా కేంద్రంలో సంపాదించి ఇంట్లో అమర్చాలని ఆంకీ ఆశ. పై పరీక్ష పాసయి అతను పై తరహా జీతగాడవాలని ఆమె ఎప్పుడూ అతన్ని తొందరపెట్టలేదు. అసలు పరీక్షకు ఏం చదవాలో, ప్రశ్నలు దేనిమీద ఉంటాయో అతనికి తెలియదు. తోటి ఉద్యోగుల్ని అడగడానికి అతను సంకోచించాడు. పరీక్షకు కూచోమని వాళ్ళే అతన్ని బలవంతపెడతారేమోనని అతని భయం. వాళ్ళలో వాళ్ళు పరీక్షని గురించి మాట్లాడుకునేటప్పుడు దాని వివరాలేవీ అతనికి అర్థం కాలేదు. పరీక్షలకున్న నత్తి మొదలైనలోపాలను గురించే తరుచు వాళ్ళు ప్రస్తావిస్తుండేవారు. అయినా అతనికొక సంగతి స్పష్టంగా తెలుసు. పరీక్షలో ముఖ్యంగా పరీక్షించేది, తెలివితేటలు, బుద్ధిసూక్ష్మత. అతనేమీ తెలివితక్కువవాడు కాడు. అయితే విదేశాలనించి దిగుమతి అయిన సరుకుల తూకం, విలువ, మొదలైన వివరాలు తను అంచనావేసినట్టు, తన్ను కస్టమ్స్ ఆఫీసులో నిలబెట్టి, కొందరు పరీక్షకులు, తన తెలివితేటల్ని అంచనా వెయ్యడం, అతన్ని కలతబెట్టింది. అదీగాక కస్టమ్స్ చట్టాన్నంతా కంఠతా పట్టాలి. ఏ యే సరుకులు ఎక్కణ్ణుంచి వస్తాయో, వాటి గిరాకీ ఎంతో, ఎంతవరకు మన్నుతాయో, వాటి రంగేమిటో, తూకమెంతో అన్నీ వేళ్ళ చివరుండాలి. సరుకులన్నీ అతనిముందు గుట్టలుగా పోస్తారు, పైన కోసుగా ఉన్న పర్వతాల్లాగా. జారిపోకుండా రేకు చట్రాలుంటాయి వాటిచుట్టూ.

అతను వాటి నన్నింటినీ పరీక్షించాలి. ప్రతి సరుకూ తూచాలి. ఉండవలసిన బరువుకన్నా ఎక్కువో తక్కువో చూడాలి. గుత్త వ్యాపారస్థుల ద్వారా చిల్లర అమ్మకందార్లకు - ఆంకీలాంటి వాళ్ళకు - ఈ సరుకులు చేరాలంటే తన పరీక్ష నిర్దుష్టంగా జరగాలి.

అతను నుదుటిమీద చెమట తుడుచుకున్నాడు.

అతని మనసు బరితెగించి లేనిపోనివన్నీ ఊహించుకుంటోంద నుకున్నాడు. కడుపు కాళీగా ఉండడం మూలాన్నేమో.

గాస్ తయారుచేసే బట్టీచుట్టూ ఉన్న ఇనుపకమ్ములమీద తల ఆన్చాడు. పైన ఇనపగొట్టాంలో నీటిఆవిరి బుసలుకొడుతూ పోతోంది. ఆ వెనక మబ్బు పట్టిన ఆకాశాన్ని చీలుస్తూ మంటలు లేస్తున్నాయి. పేర్చిన సరుకుల గుట్టలు ఎర్రటి మంటతోబాటు ఇటూ అటూ ఊగాయి, వెలుగుముందు ఆడుతున్న కాగితపు బొమ్మల్లాగ. బయటికిపోయే దారిని సూచిస్తూ ఒక ఎలక ఉందక్కడ. డీట్రిచ్ ఆ దారి ననుసరించలేదు. సరుకులు దిగుమతిచేసే ఆవరణవేపు వెళ్ళాడు. దారి పక్కని నిరుటి పచ్చగడ్డి ఎత్తుగా ఏపుగా ఆడుతోంది. శిథిలమైపోయిన పాత కొటారాల అరలమధ్యనించి మొలుచుకొచ్చింది గడ్డి. అక్కణ్ణించి మొదలుపెట్టింది కుళ్ళువాసన.

ఒకవేళ ఇది గాస్ బట్టీలో రాక్షసిబొగ్గు కాలుతున్న వాసనేమో అనుకున్నాడు డీట్రిచ్. పరీక్షకి రసాయన భౌతిక శాస్త్రాలు క్షుణ్ణంగా చదవాలి. స్కూలు వదలిపెట్టిన తరవాత ఆ శాస్త్రాల సంపర్కమే లేకండా ఉన్న వాళ్ళకి, తిరిగి అదంతా బుర్రలోకి ఎక్కించడం అసంభవం. కొంతదూరం నడిచి రెండోపక్కనించి గాస్‌బట్టీ వైపు చూశాడు. చిక్కని పొగమధ్య నల్లని తెడ్లు బొగ్గు కొలిమిలోకి విసురుతూ ఇటూ అటూ కదులుతున్నాయి. మంటలు బట్టీలపై ఉన్న ఇనప నిచ్చెనలను నాకుతున్నాయి. బ్రహ్మాండమైన ఆ చితి డీట్రిచ్ కళ్ళలో ప్రతిఫలించింది. యుద్ధంతో ఈ దృశ్యం ఇలాగే కనబడివుంటుంది. కొటారాలు మండుతూ కూలిపోయి ఉంటాయి. సరుకులు మోసే క్రేనులు ఎర్రగా కాలికాలి, ముడుచుకుపోయి నీళ్ళలోకి జారిపోయి ఉంటాయి. స్వేచ్ఛాప్రాంతంలో సరుకులన్నీ బొగ్గయిపోయి ఉంటాయి. అప్పుడతను ఉత్తరంగా విమాన విధ్వంసక శాఖలో ఉండేవాడు. డెన్మార్క్ సరిహద్దుకి దగ్గరగా. అప్పుడీ పొడుగాటి గడ్డి కొటారపు గదులల్ని ఆక్రమించుకుని ఉండదు.

అప్పుడు గాస్‌బట్టీలో మంటలు చల్లారిపోయాయి.

ఆలస్యంగా ఇంటికి చేరుకున్నందుకు ఆంకీ ఏమీ అనలేదతన్ని.

"పనేమన్నా తగిలిందా?" అని అడిగింది.

ఆమెకు అబద్ధం చెప్పడం అతని కిష్టంలేదు. వివరించి చెప్పడమూ ఇష్టంలేదు "లేదు," అన్నా డతను.

ఇంకేమీ అడగలేదామె. పరీక్షను గురించే ఆలస్యమైందనుకుం దామె. బంగాళాదుంపలు తెచ్చింది. మళ్ళీ వెచ్చబెట్టటం మూలాన్ని వాటి పై తొక్కలు ముడుచుకుపోయాయి. వేపుడు మాంసం ముక్కలుగా కోసిం దామె.

"పులుసంతా ఆరిపోయింది. ఉప్పగా లేదు గదా,"

చెయ్యి తుడుచుకునే గుడ్డ అతనికి అందించింది. మెల్లగా తిన్నాడతను. జాగ్రత్తగా ప్రతి దుంపా చీల్చాడు. ప్రతిసారీ ఆహారం నోట్లో పెట్టుకునేముందు పొర్కుకింద పెట్టాడు. అతని చూపులు కంచం అంచు వదలలేదు.

"రుచి ఎల్లా వుంది? బాగా లేదా?"

"ఉంది."

అతిజాగ్రత్తగా నమిలాడు. మెల్లగా మళ్ళీ అన్నాడు, "బాగానే వుంది," అని.

ఆమె వడ్డిస్తూ వంగింది. అత నామెవంక చూశాడు. అతని చూపులు ఆమె చెక్కుల అంచుల్ని అనుసరించాయి. పౌడర్ అద్దిన మూలాన్ని కొంచెం గులాబి రంగొచ్చింది ముఖానికి. ఎత్తుగా చుట్టిన ఆమె తలకట్టు చూశాడు. ఆమె కనురెప్పలు చూశాడు. పైరెప్పల అంచుని జాగ్రత్తగా నల్లని కాటుక గీత దిద్దుకుందామె. ఆమె బ్లౌజ్ కాలర్ స్వచ్ఛంగా తెల్లగా ఉంది. ఆంకీ ప్రతిరోజూ బ్లౌజ్ మార్చుకుంటుంది. ప్రతి శుక్రవారం వారం తొడుక్కున్న బ్లౌజ్‌లన్నీ దొంతరగా తీసికెళ్ళి క్షణంలో శుభ్రంగా ఉతికేసుకుంటుందామె, పెద్దగా అవి మాయకపోయినా సరే. విప్పేసినప్పుడు కూడా వాటిని కమ్మని సబ్బు వాసన యింకా పట్టుకునే వుంటుంది. దీపాలు ఆర్పేసిన తరవాత పల్చని నైట్‌డ్రెస్ వేసుకుని అతని చెంతకు వచ్చే ఆమె విగ్రహం అతనికి గుర్తుకొచ్చింది. చూపులు కిందికి దించాడు. శుభ్రంగా కడిగిన పింగాణీ పాత్రలు, వాటిలో భోజన పదార్థాలూ, వుప్పు, మిరియప్పొడి సీసాలు, వాటికింద తెల్లని టేబిల్ క్లాత్‌లో నలగని ఇస్త్రీ మడత. అంతా సవ్యంగా వుంటుంది, వుండవలసినట్టుగా, హాయిగా గడిచిపోతుంది కాలం. తను పరీక్షకి కట్టాలంతే. జీతం పెరిగితే, ఇంకా కొంచెం పెద్దతరహా టేబిల్ కొనవచ్చు. మంచి పింగాణీ, ఖరీదైన భోజనం, టేకు బీరువాలు, అన్నీ వొస్తాయి. ఇంక పిల్లల విషయం. అది పరీక్ష పాసయిన తరవాతే ఆలోచించాలి. ఒకవంక రొట్టెల దుకాణంలో పనిచేస్తూ బిడ్డనెల్లా చూసుకోగలదు ఆంకీ? పై ఉద్యోగమయితే హోదా పెరుగుతుంది. స్వేచ్ఛా ప్రాంతంలో సరకుల రవాణా తన పర్యవేక్షణ కింద జరుగుతుంది. కస్టమ్స్ ఇన్‌స్పెక్టరైతే, ఒక్క నిమిషం వృధాపుచ్చ నక్కరలేదు. రోజల్లా తిరిగి తిరిగి, కాళీకార్లనీ, అమాయిక వ్యక్తుల్నీ పరీక్ష చెయ్యక్కర్లేదు. కస్టమ్స్ ఇన్‌స్పెక్టరైతే ఆంకీని తన ఆఫీసులోకి తీసుకువెళ్లొచ్చు. బల్లమీదున్న కాగితాల దొంతర్లూ, కిటికీలోంచి అవతలున్న పడవల రేవుల్ని గర్వంగా చూపిస్తూ, "ఇక్కడ నేను పనిచేసేది" అని చెప్పొచ్చు.

అంతకంతకి అతను చిన్నగా మరీ చిన్నగా అయిపోతున్నట్టు అనిపించింది. కొటారాలలో పేర్చిన పెద్ద విదేశీ పింగాణీ సామాను పెట్టెల మధ్య తిరిగే చిట్టెలకలాగ. ఇతరుల సామాన్ల మధ్య తడుముకుంటూ తిరగడానికే తను నియోగించబడ్డట్టు అనిపించిం దతనికి. ఇంటి దగ్గర పడక గదిలో పిల్లల గుడ్డలు, స్వెటర్లు, మందుల సీసాలు, స్టాకింగులూ, రబ్బరు బంతులూ చిందరవందరగా పడున్న దృశ్యం కనబడింది. "ఇంక ఆంకీ, నేనూ ఎక్కడ మిగులుతాం?" అనుకున్నాడతను.

భోజనం ఆపేశాడు. సగం తిన్న ప్లేట్లు కొన్నీ, కాళీవి కొన్నీ, ఆంకీ అవతలికి పట్టుకుపోయింది.

అతనికి కాస్త ఉత్సాహం కలిగించాలి అనుకుందామె. అతను పరీక్ష సులభంగా పాసవుతాడు.

"డీట్రిచ్, నువ్వు పరీక్ష పాసవడాని కేముంది. నువ్వు తక్కిన వాళ్ళలా కాదుగా. నీ తెలివే వేరు. నీ తరహాయే వేరు" అందామె.

"నా కోసం చెప్పడం లేదు. మనకి రోజులు బాగానే గడిచిపోతున్నాయి, నాకేమో మంచి సౌకర్యాలు కావాలని నిన్ను పరీక్ష పాసవమనడంలేదు. మంచి భార్యనైతే చాలు.

మన బిడ్డల్ని ప్రేమతో సాకుతాను. రొట్టెల దుకాణంలో పనిచెయ్యవలసివస్తే చేస్తాను. కాని నీ తెలివితేటలకీ, నీ చురుకుదనానికి, ఈ చిన్ని ఉద్యోగంతో ఎంతకాలం తృప్తిపడగలవు?

"మరో ఉద్యోగం ఏదీ దొరక్క కస్టమ్స్ ఉద్యోగంలో చేరలేదు నువ్వు, మీ తాతగారి మాట కాదనలేక ప్రవేశించావు. ఆయన చూడు, చదువులో ప్రాథమిక పాఠశాల దాటకపోయినా, ఇన్స్పెక్టర్‌గిరీ దాకా వొచ్చాడాయన. పరీక్షను గురించి నువ్వంత ఆదుర్దా పడక్కర్లేదు, ఏమైనా మొత్తంమీద మనిషి చురుకుదనాన్ని కనిపెట్టడానికే ఆ పరీక్ష. అదీగాక రెండేళ్ళక్రితం కస్టమ్స్ సహకారి పరీక్ష అతి సులభంగా పాసయావు. నాకోసం చెప్పడంలేదు. మామూలు ఉద్యోగి అయినా పై ఉద్యోగి అయినా మనిషి తరహా నాకు కావలసింది. నేనదేమంటే, కస్టమ్స్ ఆఫీసులో చేరిన మొదటిరోజుల్లో యుద్ధం ముగిసిన తరవాత స్థిరమైన ఉద్యోగం దొరికిందని సంతోషించావు. విమాన విధ్వంసక శాఖలో నీ అనుభవాలన్నీ మననం చేసుకోవాలనుకున్నావు. అయితే ఇప్పుడేదో కాస్తపైకి వెళ్ళాలని నీకు కోరిక కలిగింది. ఏదో ఇంటి ఖర్చుకి నాలుగు డబ్బులు ఎక్కువొస్తాయని నేను అనడం లేదు. నిజంగా చెప్తున్నాను.

బ్రతుకులో చిల్లర చితుకులు తప్ప యింకేమీ మిగలవనిపించిం దతనికి, తరుచు జంతుప్రదర్శనశాలకి వెళ్ళడం తగ్గిపోతుంది. నదిఒడ్డుని షికార్లు తగ్గిపోతాయి.

"పిల్లలు! మాకు పిల్లలు కావాలా?" అనుకున్నాడతను.

పైకి అన్నాడు: "విమాన విధ్వంసక శాఖలో ఉండేటప్పుడు పరిస్థితులు వేరు. పిల్లల్ని కని సంసారాలు పెంచుకోవాలన్న ఆలోచనే లేదప్పుడు మాకు. నలుగురో ఆరుగురో చొప్పున శిబిరాల్లో పడుకుని ఉండేవాళ్ళం. పగలు దగ్గరలో ఉన్న తోటల్లోకి చొరబడి ఆపిల్ కాయలు కోసుకు తినేవాళ్ళం. ఏ ఊరుమీద బాంబులు పడ్డాయో – ఎంతమంది చచ్చిపోయారో రేడియోలో వినేవాళ్ళం. బాగుండేవి ఆ రోజులు. ఎందుకోగాని ఎంతో బాగుండేవి."

నేనూ, నేను పడుతున్న తాపత్రయమూ, అంతా అతనికి అనవసరంలా కనిపిస్తుంది – అనుకుంది ఆమె. అప్పుడేదో తన్మయత్వంలో పెళ్ళాడేశాం. ఆట పాటల్లో మైమరచిన చిన్నపిల్లల్లాగ.

"ఏవీ? విమాన విధ్వంసక శాఖలో మీరు తీయించుకున్న ఫోటోలు నాకు చూపించవూ?" అందామె.

పరీక్ష తప్పితే? – అనుకున్నా డతను. వి.వి.శాఖలో అందరితోబాటు అతనుకూడా గుండుదెబ్బలకి నిలబడ్డాడు. ఇప్పుడు ఆ సాహసం నాలో జారిపోయిందేమో? బహుశా పిరికితనంవల్లే పరీక్షలంటే భయపడుతున్నానేమో. నా పెళ్ళాం, నా స్నేహితులు, అంతా నన్ను ఈసడించుకుంటారప్పుడు.

"డీట్రిచ్, నన్ను గురించి నువ్వు పరీక్షకి కూచోనక్కర్లేదు. ఎల్లాగో ఒకలాగ గడిపేస్తాం."

ఆమె అనుకునే దొకటి పైకి చెప్పేదొకటి, అనుకున్నాడతను. ఆమెకు పిల్లలు కావాలి. మెరుస్తున్న తోపుడు బండిలో పడుకోబెట్టి, వాళ్ళని బయట తిప్పుతుంటే ఆమెకు సంతృప్తి. పరీక్షలంటే నాకేం భయం లేదు.

"వి.వి.శాఖలో మీరు సరదాగా గడిపిన రోజుల తాలూకు ఫోటోలు నాకు చూపించు," అందామె.

"ఇప్పుడే చూపిస్తా. ముందు కొంచెం సిగరెట్లు తెచ్చుకోవాలి."

"ఇంకా ఉన్నా యిక్కడ."

"ఇవి ఫిల్టర్ టిప్ సిగరెట్లు కాదు. ఫిల్టర్ వుంటే యిష్టంగదా నీకు."

"కోటు తొడుక్కుని వెళ్ళరాదూ?"

"అక్కర్లేదు. వాన కురవడం లేదు. చలీ లేదు."

ఆమె కాచుక్కూర్చుంది. కార్ల దీపాలు గది వెనక గోడమీద చెట్లకొమ్మల నీడ బొమ్మల్ని రచిస్తూపోతున్నాయి, నేల అలమారుకి పైన.

ఇక ముందు ముందు తను ఇలాగే ఒంటరిగా అతనికోసం ఎదురుచూస్తూ కూచోవాలేమోనన్న భయం అకస్మాత్తుగా నరనరాల్లో పాకింది. ఎప్పుడో ఒక రోజున తన్ని మోసగిస్తాడేమోకూడా. పని మరింత బరువైపోతుందేమో అతనికి. గోడమీద మళ్ళీ నీడపడేసరికి మనసులో భయం మాయమైపోయింది. కాఫీ కప్పులు, కేకులు సిద్ధంగా వాటివాటి స్థానాల్లో పెట్టింది. అతను రాగానే ఇవ్వడానికి. ఏదో జరిగింది సిగరెట్లకు వెళ్ళిరావడానికి అయిదు నిమిషాలకన్నా పట్టదు. వెళ్ళి గంటైంది. లేకపోతే ఒంటరిగా కూర్చుని ఎదురుచూస్తుంటే కాలం నడవదేమో, ఎవరన్నా స్నేహితుడు కనిపించాడేమో.

చిలిపి గయ్యాళి భార్యలాగ భర్తను అనుసరించి, అతనేదో కులాసాగా కూర్చుని తాగుతుంటే లాక్కురావడం ఆమె కిష్టంలేదు.

ఇదే మొదటిసారి అనుకుందామె.

ఆమె గొంతులో భయం కర్రబిరడాలాగ బిగిసింది.

ఇకరోజూ ఇలాగే జరుగుతుంటుందా? ఇక నా బ్రతుకంతా కాఫీకప్పు మధ్య, ప్లేట్లూ కంచాలమధ్య, బట్టలకొయ్యలమధ్య గడిచిపోవలసిందేనా? తనకొక్క బిడ్డ పుట్టివుంటే! కిటికీ తెరిచి ముందుకి వంగింది, అతను వస్తుంటే దూరాన్నుంచైనా కనబడతాడని.

ఒక్క బిడ్డయినా తనకి కలిగిఉంటే – అతనికోసం ఇల్లా వేచి ఉన్నప్పుడు కాస్త కాలక్షేపమన్నా అవుతుంది.

కిటికీ అంచుమీదినుంచి లేచిందామె. బయట వసారాలోకి వెళ్ళింది, ఒకవేళ అతను వచ్చిదుస్తులు మార్చుకుంటున్నాడేమోనని.

లేదు. అతనసలు కోటే వేసుకువెళ్ళలేదు. అంచేత ఏ క్షణాన్నయినా అతను వచ్చెయ్యడం ఖాయం. అతను నన్ను వదిలేసేముందు ఒక్క బిడ్డన్నా అతనివల్ల కలిగితేనా! "నీకు మతిపోయింది," అనుకుంది.

మహా అయితే ఇంకొక్క అరగంట, అంతా మాములుగా వుంటుంది. ఒకవేళ పరీక్షంటే భయంవేసి ఆత్మహత్య చేసుకోలేదుగదా! ఆత్మహత్యకు పాల్పడే రకం కాదతను.

మళ్ళీ వీధిలోకి చూడాలని బుద్ధి పుట్టిందామెకు. కాని ఆ కిటీకి చీకటి చదరం చూసినకొద్దీ భయం వేసింది.

కాని అనవసరంగా ఆపద శంకించడం ఎందుకు?

ఆమె కళ్ళు కాగితం అంటించిన గోడలకీ, అద్దకపు తెరలకీ మధ్య వున్న చీకటి చదరాన్నించి కదల్లేదు. అత న్నెవరో కొట్టివుంటా రనుకుంది. లాండు కిటికీ ముందు అతను రక్తం కారుతూ పడివుంటాడు. బట్టలుతికే ఒంటికన్ను యంత్రాలు అతనిలో ప్రాణ రక్తం కారిపోతుంటే రెప్పవెయ్యకుండా చూస్తుంటాయి. అట్లాంటివన్నీ ఊహించుకో కూడదు. అది అపశకునం.

"అతన్ని గురించి నిజంగా నాకేం తెలియదే. అతను మనసువిప్పి చెప్పితేనా –" అనుకుంది. పైకే. ఏదో కారు ప్రమాదం జరిగుంటుంది. ఆ పెద్దదెబ్బలేమీ తగిలి వుండవు. కట్లు కట్టించుకోడానికి ఆస్పత్రికి పోయి వుంటాడు.

ఇంక ఆ చీకటి చదరంవైపు చూడలేకపోయింది. కంటిగుడ్లమీద రెప్పలు గట్టిగా మూసుకుంది. రెప్పలకీ కంటిలోపలి తెరకీ మధ్య తెల్లని చదరం రప్పుమంది. రవ్వల మెరుపులు దాని మధ్యగా దూసుకుపోయాయి. పలచబడ్డాయి, అంతరించిపోతున్నాయి.

"నా భర్త ఎక్కడున్నాడు? నా డీట్రిచ్ ఏమైపోయాడు?" పోలీసుల దగ్గరకు పోవడానికి ఆమెకు మనసొప్పలేదు. అతను మాయమవడం, తనకీ అతనికీ సంబంధించిన విషయం. తనే వెళ్ళి వెతకడానికి నిర్ణయించుకుంది. ఒక చీటీవ్రాసి పెట్టింది: "నిన్ను వెతకడానికి స్వేచ్ఛా ప్రాంతానికి వెడుతున్నాను. నేను తిరిగొచ్చేదాకా ఎక్కడికీ వెళ్ళొద్దు. లేకపోతే ఎక్కడికి వెడుతున్నావో చీటీ వ్రాసిపెట్టు."

ఆమె బస్సు ఎక్కలేదు. ఎక్కడ దిగాలో ఆమెకే తెలియదు. రోడ్డుమీద పోతున్నవాళ్ళని దారి అడిగింది. తరుచు, అతనామె వెనకాలే నడిచివస్తున్నట్టు మనసులో ఎక్కడో అనుమానం. వెనక్కి తిరిగింది. ఎవరూ లేరు. ముక్కూ మొహం ఎరగని వాళ్ళు తప్ప. "కస్టమ్స్" అని వ్రాసివున్న వంతెన ముందు నిలబడింది. ఇంటికి వెళ్ళిపోదామనుకుంది. అతని మరో ప్రపంచంలోకి దొడ్డిదారిని తనెందుకు ప్రవేశించడం? కాని తను ఇల్లొదిలిపెట్టి ఎంతోసేపు కాలేదు. అతనింకా తిరిగొచ్చాడే లేదో.

వంతెన దాటింది. కింద నీటిమీద వీధిదీపాల వెలుగు మెరుస్తోంది. వంతెన కమ్ముల నీడలు నీటిమీద ఆడుతున్నాయి. కావలి గదిలోకి వెళ్ళింది. పెద్ద కాటా ఉందక్కడ. కావలి ఉద్యోగస్థుణ్ణి అడిగింది. "స్వేచ్ఛా ప్రాంతంలో అలా తిరిగి రావచ్చునా?" అని.

"ఇంకో పనేమీ లేకపోతే, నీ ఇష్టం" అన్నాడొక ఉద్యోగి.

"ఇంత రాత్రివేళ నీకక్కడ ఏం కావాలి?" అని అడిగాడింకొకడు.

"ఊరికే షికారుగా ఈవేపు వొచ్చాను. చూసిపోతాను."

"ఒక హెచ్చరిక. తిరిగి వెళ్ళేటప్పుడు, నీ దగ్గర పన్ను కట్టవలసిన వస్తువులేమన్నా ఉంటే చూపించాలి."

"అల్లాగే."

ఆ వీధిపేరు చదవడానికి ప్రయత్నించింది. చిత్రం. అవతల పట్నంలో ఉన్నట్టే ఇక్కడి వీధులకీ పేర్లున్నాయి. ముదురు నీలిరంగు పింగాణీ పలకమీద "హాలండ్," అని ఉంది.

ఒకవేళ అతను హాలండ్ వెళ్లాడేమో. తప్పకుండా అతను ఇక్కడే దొరుకుతాడతను ఏదో మరిచిపోయుంటాడు. లేకపోతే పై ఉద్యోగి ఎవరన్నా దార్లో కనిపించి అనుకోకుండా పరీక్ష చెయ్యవలసిన పని తగిలిందని చెప్పి తీసుకొచ్చి ఉంటాడు.

ఇరుపక్కలా ఎత్తుగా చీకటిగా ఉన్నాయి ఇళ్లు. కాపురాలుండే ఇళ్ళలాగే అగుపించాయి ఆమెకి. అయితే తలుపు తెరుచుకుని ఒక్క గృహస్థూ ఏ ఇంటిలోకీ వెళ్ళలేదు. చప్టా చేసిన కాలిదార్లు నున్నగా ఉన్నాయి. ఇంటి ముంగిళ్ళకు దగ్గరగా వెళ్ళింది. రాగిచట్రాల వంక కన్నెత్తి చూసింది. కిటికీలన్నీ మూసి ఉన్నాయి. ముదురు నీలిరంగు పూసిఉంది వాటి అద్దాలమీద.

గుడ్డివాళ్ళ కళ్ళల్లాగ అనుకుందామె.

వీధి చివర ఏవో మంచెల్లాగ కట్టిఉన్నాయి. వాటిమధ్య మంటలు లేస్తున్నాయి.

అంటుకున్నాయి. అందుకే ఆత్రంగా పరుగెత్తుకుని వొచ్చిఉంటాడు - అనుకుంది.

ఉక్కు ఊసలతో కట్టిన మంచెల దగ్గరకు వొచ్చేసరికి, క్షణం క్రితం రగులుతున్న మంటలు చల్లారిపోయాయి. తరవాత సరుకులనెత్తే క్రేనుల పక్కనించి పరుగెత్తింది. రైలు ఇంజన్ దాటింది. సిగ్నల్ స్తంభాలు, పట్టాల గజిబిజిలో దారి తప్పింది. వెతికివెతికి వెనక్కి తిరిగింది. తిరిగి వెళ్ళేటప్పుడు మళ్ళీ కిటికీలవంక చూసింది; కాపరమున్న వాళ్ళెవరన్నా ఒక్క కిటికీ అయినా తెరిచి బయటికి తొంగి చూస్తారేమోనని. కాలు జారింది. పట్టుకోసం ఆత్రంగా రాతిగోడమీద తడిమింది. కిటికీ అంచుకింద సన్నని రజను ఆమె చేతిని ఒత్తింది. కొంత రజను అరచేతిలో పోగుచేసింది. దీప స్తంభం వెలుగులో దాన్ని పరీక్ష చేసింది.

కాఫీ - అనుకుందామె. వేయించని కాఫీ పొడుం. వీధంతా కాఫీగింజలతో నిండిపోయింది. ప్రతి కిటికీ వెనకాలా కాఫీ గింజలు. డీట్రిచ్! ఈపాటికన్నా ఇంటికి వచ్చి వుండవా?

తలుపు తెరవగానే, ఆమె వ్రాసిపెట్టిన చీటి బల్లమీదనుంచి గిర్రుని ఎగిరి క్రిందపడింది. ఇంట్లో ఎక్కడా డీట్రిచ్ లేడు. దుస్తులు మార్చుకోకండానే మంచంమీద వెల్లగిల పడుకుంది. దుప్పటి మడతల్ని ఆమె వేళ్లు అనుకోకండా తడిమాయి. సగం తడిమి ఆగిపోయాయి.

అతను తిరిగి రాలేదు. పై అధికారులెవరూ రాత్రి డ్యూటీకి అతన్ని రమ్మనలేదు. అతని స్నేహితులకెవరికీ అతనెక్కడున్నాడో తెలియదు. పోలీసులకి ఆచూకీ ఏమీ దొరకలేదు. వెతకడం ప్రారంభించారు. వేసవి రాగానే తిరిగి అన్వేషణ మొదలుపెట్టారు. దేశం నలుమూలలా గాలించారు. ఉత్తర దిక్కుగా డెన్మార్క్ సరిహద్దుకి దగ్గరగా అతని శవం దొరికింది. విమాన విధ్వంసక కేంద్రంలో ఒక రక్షణ శిబిరంలోకి వెళ్లాడతను. అక్కడంతా గడ్డీ, మొక్కలూ చీదరగా పెరిగాయి. నిద్రమాత్రలు దండిగా మింగేశాడతను.

●